నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, బుధవారం 10 ఏప్రిల్ 2024 | KARIMNAGAR

# హరితహారం చెట్లు నరికివేత

- ముత్తారంలో వేబ్రిడ్జి నిర్వాహకుల నిర్వాకం
- 30కి పైగా చెట్లు తొలగింపు



ముత్తారం, ఏప్రిల్ 9 : అటవీ సంపద పెంపు కోసం కేసీఆర్ ప్రభుత్వం హరితహారంలో భాగంగా నాటిన చెట్లను ముత్తారం మండల కేంద్రంలో కొందరు వేబ్రిడ్జ్ నిర్వాహకులు ఇష్టారీతిన నరికివేశారు. వివరాల్లోకి వెళ్తే.. ముత్తారంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా వేబ్రిడ్జి నిర్మాణం ప్రారంభించడమే కాకుండా, దానికి అడ్డుగా ఉన్నాయని సుమారు 30 చెట్లను తొలగించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో రైతులకు అవసరమైతే లైన్‌క్లియర్ (ఎల్‌సీ) ఇవ్వని విద్యుత్ శాఖ అధికారులు.. ఎలాంటి పర్మిషన్ లేకుండా చెట్లను తొలగించడానికి మాత్రం ఏకంగా 30 నుంచి 40 నిమిషాలు కరెంట్ సరఫరా నిలిపివేసినట్లు తెలిసింది. కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా మొక్కలు పెంచగా, ఇలా కొందరు ఇష్టారాజ్యంగా నరకడంపై ప్రకృతి ప్రేమికులు, ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతున్నది. కాగా, వేబ్రిడ్జి నిర్మాణంపై ముత్తారం గ్రామ కార్యదర్శి సంతోష్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా తాము ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు. తాము పరిశీలించి, చర్యలు తీసుకుంటామని ఇటు అటవీ అధికారులు స్పష్టం చేశారు.



# నేడు జగిత్యాలకు కేసీఆర్

## ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శకు రాక

జగిత్యాల, ఏప్రిల్ 9: జగిత్యాలకు చెందిన సీనియర్ న్యాయవాది మాకునూరు హనుమంతరావు గత నెల 29న అనారోగ్యంతో మృతి చెందగా.. ఆయన కుమారుడు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను పరామర్శించేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించే 13వ రోజు కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. హనుమంతరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించనున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తెలిపారు.

# పేపర్ మీదనే కొనుగోలు కేంద్రాలు..

# క్షేత్రస్థాయిలో ఏవి?

- ధాన్యం కొనుగోళ్లపై సర్కారు నిర్లక్ష్యం
- 1,183 ఏర్పాటు చేశామని చెబుతున్నా.. 80 శాతానికిపైగా ఓపెన్‌కాని కేంద్రాలు
- ఇదే అదనుగా రంగంలోకి వ్యాపారులు
- ₹1800కే క్వింటాలు చొప్పున కొనుగోలు
- ₹400 దాకా నష్టపోతున్న రైతు
- ఇప్పటికే 25 శాతానికిపైగా కోతలు
- ఈ వారంలో ముంచెత్తనున్న దిగుబడులు
- ప్రభుత్వం నిద్రమత్తు వీడకపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం



పెగడపల్లిలో రైతులు ఆరబోసిన ధాన్యం

జిల్లాల వారీగా ఏర్పాటు చేయాల్సిన కొనుగోలు కేంద్రాలు. ఈ నెల 8వ తేదీ నాటికి ప్రారంభించినవి.

| జిల్లా | మొత్తం కేంద్రాలు | ప్రారంభించినట్టు చెబుతున్న కేంద్రాల సంఖ్య |
|---|---|---|
| జగిత్యాల | 418 | 410 |
| కరీంనగర్ | 341 | 250 |
| రాజన్నసిరిసిల్ల | 259 | 240 |
| పెద్దపల్లి | 313 | 283 |
| మొత్తం | 1,331 | 1,183 |

**యాసంగి ధాన్యం కొనుగోళ్లపై నిర్లక్ష్యం కనిపిస్తున్నది. ఇప్పటికే కోతలు ప్రారంభం కాగా, అప్రమత్తంగా ఉండాల్సిన యంత్రాంగం అలసత్వం చూపుతున్నది. ప్రభుత్వం కూడా అదే ధోరణితో ముందుకెళ్తుండడం రైతుకు శాపంలా మారుతున్నది. ఈ సీజన్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 1,331 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ఇప్పటికే 1,183 ప్రారంభించామని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉన్నది. క్షేత్రస్థాయిలో 80 శాతానికిపైగా సెంటర్లు ఓపెన్ కాలేదని తెలుస్తుండగా.. ఇదే అదనుగా వ్యాపారులు రంగంలో దిగారు. క్వింటాల్‌కు ₹1800లే చెల్లిస్తుండగా, తప్పని పరిస్థితుల్లో కర్షకులు అగ్గువకే అమ్ముకుంటున్నారు. ఒక్కో క్వింటాకు ₹400 దాకా నష్టం జరుగుతుండగా, సర్కారు చోద్యం వల్లే తాము నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. అధికారుల మాటలన్నీ నీటిమూటలేనని, లెక్కలన్నీ పేపర్లమీదే ఉన్నాయని మండిపడుతున్నారు. మరో వారంలో కోతలన్నీ దాదాపు చివరి దశకు చేరుకొని ధాన్యం పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వం మొద్దునిద్ర వీడకపోతే భారీ నష్టం వాటిల్లే ముప్పు ఉంటుందని హెచ్చరిస్తున్నారు.**

కరీంనగర్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): యాసంగి సీజన్‌లో జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో మొత్తం 1,331 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. ఈ నెల 8 నాటికే 1,183 కేంద్రాలు ప్రారంభించామని చెప్పారు. జిల్లాల వారీగా చూస్తే జగిత్యాలలో 418 కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇప్పటికే 410 ప్రారంభించినట్లు చెబుతున్నారు. అలాగే కరీంనగర్‌లో 341కి గాను 250, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 259కి గాను 250, పెద్దపల్లి జిల్లాలో 313కు గాను 283 ఓపెన్ చేశామంటున్నారు. అయితే యాసంగి వరి కోతలు పదిహేను రోజుల నుంచే మొదలయ్యాయి. రోజురోజుకూ జోరుగా సాగుతున్నాయి. కోసిన ధాన్యాన్ని రెండు మూడు రోజులు ఎండబెట్టి విక్రయించేందుకు రైతులు చూస్తుంటే.. ఎక్కడా సెంటర్లే కనిపించడం లేదు. దీంతో ఏం చేయాలో తెలియడం లేదు.

### జాడలేని కేంద్రాలు!

అధికారులు చెబుతున్నట్లుగా ఉమ్మడి జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏ జిల్లాలోనూ ప్రారంభం కాలేదు. క్షేత్రస్థాయిలో చూస్తే ప్రతి మండలంలోనూ ఒకటి రెండు కేంద్రాలు తప్ప, మిగిలిన వాటి జాడ కనిపించడం లేదు. ఈ నెల 8 నాటికి 1,183 కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రకటించినా.. క్షేత్రస్థాయి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం కేవలం 327 కేంద్రాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. అంటే మిగతావన్నీ పేపర్‌పైనే ఓపెన్ చేసినట్లుగా లెక్కలు కనిపిస్తున్నాయి. ఎప్పటి మాదిరిగానే ప్యాక్స్, ఐకేపీ, మెప్మా, డీసీఎంఎస్‌ల ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తామని ప్రకటించిన అధికారయంత్రాగం, సదరు సంస్థలతో సమావేశాలు కూడా నిర్వహించింది. అయితే వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసే విషయంపై అధికారులు దృష్టిపెట్టడం లేదన్న విమర్శలున్నాయి. నిజానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, కొనుగోళ్లపై ఏ రోజుకారోజు సమీక్షలు చేస్తే తప్ప రైతులకు న్యాయం జరిగే పరిస్థితుల్లేవు.

### తెగనమ్ముకుంటున్న రైతులు

ప్రస్తుతం ధాన్యం ఫైన్ రకం క్వింటాల్‌కు ₹2,203, సాధారణ రకానికి ₹2,183 మద్దతు ధర ఉంది. ఇంకా తాము అధికారంలోకి వస్తే ధాన్యం క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటనలు కూడా చేసింది. ఆ లెక్కన చూస్తే మరింత పెరిగే అవకాశం కనిపిస్తున్నది. అయితే బోనస్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతుండగా, ఈ సీజన్‌లో ఇవ్వరని స్పష్టంగా అర్థమవుతున్నది. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లాలో పదిహేను రోజుల క్రితమే వరి కోతలు ప్రారంభం కాగా, ఇప్పటికే పలు గ్రామాల్లో 20 నుంచి 25 శాతం వరకు పూర్తయ్యాయి. అయితే ధాన్యా న్ని కొనుగోలు కేంద్రాలకు తరలిద్దామంటే మెజార్టీ ప్రాంతాల్లో సెంటర్లు ప్రారంభంకాక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అకాల వర్షాలు వస్తుండడం, మరోవైపు మళ్లీ వర్షాలు రావొచ్చని వాతావరణ శాఖ సూచన చేయడంతో ఆగమవుతున్నారు. ఎండబెట్టిన ధాన్యం ఎక్కడ తడిసిపోతుందో అన్న భ యంతో అగ్గువకే అమ్మేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు, రైస్‌మిల్లర్లు క్వింటాల్‌కు ₹1800 చెల్లిస్తుండగా, ఈ లెక్కన ఒక్కో క్వింటాల్‌పై సుమారు ₹400 దాకా నష్టపోతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో అమ్ముకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.


### అప్రమత్తం కాకపోతే భారీ నష్టం

నాలుగు జిల్లాల్లోనూ వరి కోతలు ఉధృతమయ్యాయి. అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకొని కొంత మంది రైతులు నాలుగైదు రోజులు ముందుగానే కోతలు కానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం దిగుబడులు ఒకేసారి కొనుగోలు కేంద్రాలకు వెల్లువెత్తే అవకాశమున్నది. ఈ క్రమంలో అధికారయంత్రాంగం అప్రమత్తం కావాల్సి ఉన్నది. యుద్ధ ప్రాతిపదికన లక్ష్యం మేరకు కేంద్రాలను ప్రారంభించాల్సిన అవసరమున్నది. అంతేకాదు, వచ్చిన ధాన్యాన్ని వచ్చినట్లుగా నిబంధనలకు లోబడి కొనుగోలు చేసేందుకు కావాల్సిన సదుపాయాలను సమకూర్చుకునే విషయంపై దృష్టిపెట్టాలి. ప్రతి రోజూ కొనుగోలు కేంద్రం వారీగా సమీక్షిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావన్న అభిప్రాయాలున్నాయి. ఏమాత్రం నిర్లక్ష్యం జరిగినా అన్నదాతలు భారీగా నష్టపోయే ప్రమాదమున్నది. అలాగే రైతు అవసరాలను ఆసరాగా చేసుకొని మద్దతు ధరకన్నా తక్కువ రేటుతో కొనుగోలుచేసే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరమున్నది. అప్పుడే రైతుకు న్యాయం జరుగుతుంది.

# ఇంటింటికీ ఓటరు గైడ్

- వంద శాతం ఓటింగే లక్ష్యంగా రూపకల్పన
- ఓటేసే పద్ధతి, బూత్‌లో కల్పిస్తున్న సౌకర్యాలతో ముద్రణ
- బీఎల్వోల ద్వారా పంపిణీ

**ఓటింగ్ శాతం పెంపునకు వినూత్న విధానాలతో ముందుకెళ్తున్న ఎన్నికల కమిషన్ ఈ దిశగా మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఓటేసే పద్ధతిపై అవగాహన కల్పించేందుకు గతంలో ఎన్నడూ లేనివిధంగా కొత్తగా ఓటర్‌గైడ్‌ను రూపొందించింది. ఇందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను ఇటీవలే విడుదల చేసింది. త్వరలోనే బీఎల్వోల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నది.**




కరీంనగర్ కలెక్టరేట్, ఏప్రిల్ 9 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు నమోదును పెంచేందుకు భారత ఎన్నికల కమిషన్ అనేక చర్యలు చేపడుతున్నది. యువ ఓటర్ల నమోదుకు ఈ నెల 15 వరకు అవకాశం కల్పించింది. అర్హులైన పౌరులందరినీ పోలింగ్ బూత్‌వైపు నడిపించేందుకు పలు చైతన్య కార్యక్రమాలను అమలు చేస్తున్నది. కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, కళాబృందాలు, సినిమా థియేటర్లలో అడ్వర్‌టైజ్‌మెంట్లు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నది. ఈ యేడు ఇందుకు భిన్నంగా 100 శా తం ఓటింగ్ లక్ష్యంగా కొత్త విధానమైన ఓటరు గైడ్‌కు రూపకల్పన చేసింది. బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయాలని నిశ్చయించింది.

### గైడ్‌లో ఏమున్నది

16 పేజీలతో కూడిన ఓటరు గైడ్‌లో ఓటు వినియోగంపై అవగాహనకు అంశాలను అందులో చేర్చింది. ఓటు రిజిస్ట్రేషన్ ద్వారా ఓటరు జాబితాలో తమ పేర్ల పరిశీలన. పోలింగ్ రోజున అనుసరించాల్సిన పద్ధతులు, పోలింగ్ స్టేషన్‌ను గుర్తించి, పోలింగ్ బూత్‌లోకి వెళ్లాల్సిన తీరు, ఓటు వేసేందుకు సంబంధిత అధికారులకు చూ పాల్సిన గుర్తింపు కార్డుల వివరాలు, ఓటు వేసే విధానంపై అవసరమైన సమాచారం పొందుపర్చారు. అలాగే, ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరిగినట్లు గుర్తించినా, సమాచారం అందినా, బాధ్యత గల పౌరుడిగా ఈసీకి ఫిర్యా దు చేసేందుకు పలు సంకేతాలతో కూడిన ఆన్‌లైన్ యాప్‌ల వివరాలు కూడా బుక్‌లెట్‌లో చేర్చింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపే దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల కోసం కల్పించిన సౌకర్యాలు ర్యాంప్, వీల్‌చైర్, బ్రెయిలీ లిపితో కూడిన ఈవీఎంలు, ప్రత్యేక వలంటీరు, రవాణా సదుపాయాలు, ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం, పోస్టల్ బ్యాలెట్ విధానంతోపాటు ఓటర్ల ప్రతిజ్ఞ కూడా ముద్రించారు. వీటిని నోటిఫికేషన్‌కు ముందే ప్రతి ఇంటికీ చేర్చేలా బూత్‌స్థాయి అధికారుల ద్వారా పంపిణీ చేయనున్నామని లోక్‌సభ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కే మహేశ్వర్ తెలిపారు.



మిల్లులో తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు

# పీడీఎస్ రైస్ గోదాం నుంచే మిల్లుకు

- టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ పోలీసుల దాడుల్లో బట్టబయలు
- వెంకటేశ్వర రైస్‌మిల్లులో 810 బస్తాలు పట్టివేత

కరీంనగర్ రాంనగర్, ఏప్రిల్ 9: పీడీఎస్ రైస్ దందా బట్టబయలైంది. సివిల్ సప్లయి గోదాం నుంచి రైస్ మిల్లుకు తరలిస్తున్నట్లు అధికారుల దాడుల్లో బహిర్గతమైంది. వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్‌లోని వెంకటేశ్వర రైస్‌మిల్లులో దాడులు చేశారు. ఓ ట్రాలీ వాహనంలో తీసుకొచ్చిన సుమారు 810 బస్తాల పీడీఎస్ బియ్యం బస్తాలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ బియ్యం బస్తాలను సివిల్ సప్లయి గోదాం నుంచి మిల్లుకు తీసుకొచ్చినట్టు గుర్తించారు. గోపాల్‌పూర్‌కు చెందిన రేషన్ డీలర్ బెజ్జంకి అంజయ్య.. రైస్‌మిల్ యజమాని సంతోష్‌రెడ్డితో కుమ్మక్కై పీడీఎస్ రైస్‌ను తక్కువ ధరకు కొని రైస్‌మిల్లుకు తరలిస్తున్నట్లు నిర్ధారించారు. గోపాల్‌పూర్‌కు చెందిన ఊరడి మధు వాహనంలో ఈ బియ్యాన్ని తరలించినట్లు గుర్తించి, 810 బస్తాలతోపాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో రేషన్ డీలర్ అంజయ్య, రైస్‌మిల్ యజమాని సంతోష్‌రెడ్డి, ట్రాలీ వాహన డ్రైవర్ మధుపై కేసు నమోదు చేశామని, విచారణ జరుపుతున్నామని రూరల్ సీఐ ప్రదీప్ తెలిపారు.



మిల్లులో పీడీఎస్ బియ్యం బ్యాగులు



# నీళ్లు పడుతూ.. కోళ్లను రక్షిస్తూ..

పది రోజులుగా ఎండలు భగ్గుమంటుండడంతో కోళ్ల ఫాంల నిర్వాహకులు కోళ్లను కాపాడేందుకు జాగ్రత్తలు పాటిస్తున్నారు. వేడి గాలులు తగలకుండా చుట్టూ పరదాలు కట్టి నీటిని పడుతున్నారు. అంతే కాకుండా, పైపులతో కోళ్లపై నీళ్లు పడుతూ వేడి నుంచి కోళ్లకు ఉపశమనం కల్పిస్తున్నారు. కరీంనగర్ శివారులోని వల్లంపహాడ్ రోడ్డులో ఉన్న ఓ పౌల్ట్రీ ఫామ్‌లో ఇలా కోళ్లపై నీటిని పట్టారు. - కరీంనగర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

# అల్లీపూర్ గురుకులంలో విద్యార్థుల మధ్య గొడవ

రాయికల్, ఏప్రిల్ 9: అల్లీపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకులంలో విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఇద్దరికి గాయాలు కాగా, ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురుకుల స్కూల్‌లో సోమవారం 6వ, 7వ తరగతి విద్యార్థులు గొడవపడ్డారు. ఒకరినొకరు కొట్టుకోవడంతో ఇద్దరు గాయపడ్డారు. అయితే మంగళవారం ఉగాది సెలవు దినం కావడంతో పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలకు గాయాలను చూసి ఆందోళన చెందారు. ఘటన గురించి ఉపాధ్యాయులు కనీస సమాచారం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులం ఎదుట రాయికల్ జగిత్యాల రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. టీచర్ల పర్యవేక్షణ లోపంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. గురుకులంలో నిత్య పర్యవేక్షణ చేయాలని డిమాండ్ చేశారు. రాయికల్ ఎస్ఐ అజయ్ అక్కడికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. తల్లిదండ్రులు, గురుకుల ఉపాధ్యాయులతో మాట్లాడి సంఘటన వివరాలు సేకరించారు.

# రంగంపేట శివారులో చిరుత

- భయంగుప్పిట్లో గ్రామస్తులు
- పాదముద్రలు గుర్తించాం : ఎఫ్ఆర్వో

వీర్నపల్లి, ఏప్రిల్ 9: రంగంపేట భయంగుప్పిట్లో చిక్కుకున్నది. గ్రామ శివారులో పెద్దపులి సంచరిస్తున్నదనే వార్తలతో గజగజ వణికిపోతున్నది. మూడు రోజుల క్రితం మర్గండి చెరువు(జంపన్న చెరువు)లో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు పెద్దపులిని చూసినట్లు గ్రామస్తులకు తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున సైతం బుగ్గరామన్న ఆలయం పక్కన కనిపించిందని మరికొందరు చెప్పడంతో ప్రజలు బయటికి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఈ విషయమై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావును సంప్రదించగా, గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించామని, అది పెద్దపులికాదని చిరుత పాదముద్రలుగా గుర్తించినట్లు చెప్పారు. రెండేండ్ల వయసు దాటిన చిరుతపులి పెద్దపులిని పోలి ఉంటుందని, ఇప్పటివరకు ఈ అటవీ ప్రాంతంలో పెద్దపులి తిరిగిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు.





పట్టుకున్న మద్యంతో పోలీసులు

# మధ్యప్రదేశ్ లిక్కర్.. కాట్నపల్లిలో డంప్

- ఎక్సైజ్ పోలీసుల దాడుల్లో బహిర్గతం
- 90 కాటన్ల మద్యం సీజ్

సుల్తానాబాద్ రూరల్, ఏప్రిల్ 9 : సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులో భారీ మద్యం డంపును పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. భారీగా మద్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు మంగళవారం కాట్నపల్లి శివారులోని పాతబడ్డ రైస్‌మిల్లులో తనిఖీలు చేశారు. సుమారు ₹7 లక్షల విలువైన మద్యం డంపును పట్టుకున్నారు. ఇది మధ్యప్రదేశ్‌కు చెందిన లిక్కర్‌గా గుర్తించారు. దాదాపుగా 90 కాటన్‌ల లిక్కర్‌ను సీజ్ చేసి, సుల్తానాబాద్ ఎక్సైజ్ కార్యాలయానికి తరలించినట్లు పెద్దపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మద్యం డంప్ ఎవరిదనే విషయాన్ని ఎక్సైజ్ పోలీసులు ఆరా తీసున్నారు. దాడులు చేసిన వారిలో సుల్తానాబాద్ సీఐ గురునాథ్ రాథోడ్, పెద్దపల్లి సీఐ శిరీష, ఎస్ఐ చిరంజీవి, సిబ్బంది ఉన్నారు.





# చెక్‌డ్యాంల కళ చెదిరె..

పోయినేడు వరకు మండుటెండల్లోనూ మత్తళ్లు దుంకిన చెక్‌డ్యాంలు ఈ ఎండకాలంలో చుక్క నీరు లేక వెలవెలబోతున్నాయి. నిండా నీటితో కనిపించే వాగులు కళ చెదిరిపోయి దర్శనమిస్తున్నాయి. నిరుడు మల్లన్నసాగర్ నుంచి ఎగువమానేరులోకి నీటిని వదలగా, ఆ మత్తడి నుంచి వచ్చిన నీటితో మానేరుపై ఉన్న కట్కూరు చెక్‌డ్యాం పొంగి పొర్లింది. దీంతో ఇరుపక్కల భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగుకు ఢోకా లేకుండా పోయింది. అయితే, ప్రస్తుతం సర్కారు పట్టించుకోకపోవడంతో ఎగువమానేరుకు నీళ్లు రాక ఇలా బోసిపోయింది. ఇదొక్కటే కాదు, మానేరు వాగుపై ఉన్న 12 చెక్‌డ్యాంలు కూడా వట్టిపోయాయి.

- రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ)